


'సర్దార్-2'లో కార్తి - సూర్య

తుది దశ చిత్రీకరణలో 'సర్దార్-2'

పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' తుది దశ చిత్రీకరణ పనులను జరుపుకుంటోంది. ఇటీవల మైసూర్‌లో షూటింగ్ జరుగుతుండగా, హీరో కార్తి కాలికి గాయమైన విషయం తెల్సిందే. దీంతో షూటింగ్‌ను తాత్కాలికంగా వాయిదావేశారు. ప్రస్తుతం ఆయన కోలుకోవడంతో తిరిగి షూటింగ్ ప్రారంభించి, చివరి దశ నిర్మాణ పనులను శరవేగంగా జరుపుతున్నారు.మైసూర్ షెడ్యూల్ పూర్తయ్యాక మరికొన్ని సన్నివేశాలను చెన్నైతో పాటు విదేశాల్లో జరిపే షూటింగుతో పూర్తికానుంది.ఈ చిత్రంలో ప్రముఖ దర్శక నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల అధికారికంగా వెల్లడించారు. ఇందులో రజిషా విజయన్, అరుణ్, ఆషికా రంగనాథన్ తదితరులు నటించగా, జార్జి విలియమ్స్ ఛాయాగ్రహణం అందించగా, శ్యామ్ సీఎస్ సంగీత బాణీలను సమకూర్చుతున్నారు.



రూ.100 కోట్ల క్లబ్‌లో 'గుడ్ బ్యాడ్ అగ్లీ'

అగ్రనటుడు అజిత్ కుమార్ హీరోగా, అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీ ఈనెల 10న విడుదలై ఘన విజయం సాధించడంతో పాటు ఈ యేడాది రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన మరో చిత్రంగా నిలిచింది. తమిళం, తెలుగు భాషల్లో విడుదలైన ఈ చిత్రం అన్ని చోట్లా ప్రేక్షకుల పాజిటివ్ టాక్ లభించింది. దీంతో భారీ కలెక్షన్లను రాబడుతోంది. ఫలితంగా అజిత్ కెరీర్‌లో కేవలం రెండు రోజుల్లో రూ.100 కోట్లు దాటిన తొలి మూవీగా రికార్డు సృష్టించింది. శనివారం నుంచి సోమవారం వరకు వరుస సెలవులు కావడం, మరో మంచి మూవీ లేకపోవడంతో ఈ సినిమాకు కలెక్షన్లు మరింతగా పెరిగే అవకాశం ఉందని సినీ ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ఈ మూవీలో అజిత్, ప్రసన్న, అర్జున్ దాస్, సునీల్, ప్రియా ప్రకాష్ వారియర్, యోగిబాబు తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించగా, రోమియో పిక్చర్స్ విడుదల చేసింది.

యువ హీరోతో మలయాళ బ్యూటీ డేటింగ్?



తమిళ చిత్రజ్యోతి

మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్, కోలీవుడ్ యువ హీరో ధృవ్ విక్రమ్ డేటింగ్‌లో ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. దీనికి బలమైన కారణం లేకపోలేదు. ఈ హీరోహీరోయిన్లు గాఢచుంబనంలో మునిగితేలుతున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇందుకు నిదర్శనం. అయితే, ఇందులో వాస్తమెంతో వారిద్దరే వెల్లడించాల్సి ఉంది. ఎందుకంటే, వీరిద్దరు కలిసి 'బైసన్'లో నటిస్తున్నారు. మారి సెల్వరాజ్ దర్శకుడు. ఇందులో ధృవ్ విక్రమ్ కబడ్డీ ఆటగాడిగా కనిపించనున్నారు. ఇందులో అనుపమ పరమేశ్వరన్ అతని ప్రియురాలి పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా కోసం వీరిద్దరూ ముద్దుపెట్టుకున్నట్టుగా తీసిన ఫొటోనా? లేక నిజంగానే వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నపుడు తీసిన ప్రైవేట్ ఫొటోనా? అని తేలాల్సివుంది. ఈ ఫొటో మాత్రం ఇపుడు కోలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇదిలావుండగా, సీనియర్ హీరో చియాన్ విక్రమ్ తనయుడే ధృవ్ విక్రమ్.



ధృవ్ విక్రమ్ - అనుపమ పరమేశ్వరన్

భారీ ధరకు 'జన నాయగన్' రైట్స్ విక్రయం?



అగ్రహీరో విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'జన నాయగన్'. హెచ్. వినోద్ దర్శకుడు. ఈ చిత్రం తమిళ పంపిణీ హక్కులను భారీ ధరకు ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ రోమియో పిక్చర్స్ కొనుగోలు చేసినట్టు కోలీవుడ్ సినీ ట్రేడ్ వర్గాల సమాచారం. నిజానికి ఈ మూవీ రైట్స్‌ను సొంతం చేసుకునేందుకు పలు సంస్థలు పోటీపడ్డాయి. ఎస్ఎస్ లలిత్ కుమార్, రాహుల్ వంటి బడా నిర్మాతలు పోటీపడగా, ఇందులో రోమియో పిక్చర్స్ అధినేత రాహుల్ సొంతం చేసుకున్నట్టు సమాచారం. ఈయన గతంలో విజయ్ నటించిన 'ది గోట్' మూవీ రైట్స్‌ను సొంతం చేసుకుని ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. దీంతో 'జన నాయగన్' రైట్స్ విషయంలోనూ మేకర్స్ ఆయనకే ప్రాధాన్యం ఇచ్చినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. అయితే, ఈ డీల్‌పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తుండగా, పూజా హెగ్డే హీరోయిన్. ఇతర పాత్రల్లో గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రియమణి, మమిత బైజు తదితరులు నటించారు. సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూర్చుతున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



నాగపట్టినం జిల్లా వేలాంకన్ని మేరీమాత చర్చి ప్రాంగణంలో మట్టల ఊరేగింపు

● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పండుగకు ముందుగా వచ్చే ఆదివారాన్ని క్రైస్తవులు రాష్ట్రవ్యాప్తంగా మట్టల పండుగగా ఘనంగా జరుపుకున్నారు. మట్టలు చేతపట్టుకుని 'హోసన్నా.. హోసన్నా' అంటూ పాడుతూ సందడి చేశారు. నాగపట్టినం జిల్లా వేలాంకన్ని, చెన్నైలోని వెపేరి, పెరంబూరు, అయినావరం, న్యూమోడల్ లైన్, నజరేత్‌పురం, కొరుక్కుపేట, చిగురింతపాళెం, చూలై తదితర తెలుగు క్రైస్తవులు అధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో మట్టల ఆదివారం సందర్భంగా మట్టలతో ఊరేగింపులో పాల్గొని యేసుక్రీస్తును స్తుతించారు. యేసుక్రీస్తు మరణం, పునరుత్థానం, అద్వితీయమైన ఘట్టాలుగా విశ్వసిస్తున్న క్రైస్తవులు వాటిని స్మరించుకుంటూ క్రీస్తు మరణానికి ముందే 40 రోజులను శ్రమదినాలుగా పాటిస్తున్నారు. ఈ రోజుల్లో ఉపవాసాలు చేపట్టి దానధర్మాలు చేయడం, ఇతరుల పట్ల స్నేహపూర్వకమైన వంటి నియమాలు పాటిస్తారు. కాగా, జనోద్ధరణ కోసం క్రీస్తు శిలువపై మరణించడాన్ని గుడ్‌ఫ్రైడే, ఆ తర్వాత మూడో రోజున తిరిగి ప్రాణాలతో లేచిన ఘట్టాన్ని పునరుత్థాన (ఈస్టర్) పండుగగా ఏటా జరుపుకుంటున్నారు. పస్కా పండుగ సందర్భంగా యేసు ప్రభువు బేతనియ నుంచి జేరూసలేం పట్టణానికి చేరుకుని అక్కడ గాడిదపై ఎక్కి ప్రజలను పలకరించేందుకు బయలుదేరుతారు. ఇది గమనించిన ప్రజలు అనేక మంది మట్టలు, తమ వస్త్రాలు నేలపై పరచి ప్రభువును ఆహ్వానిస్తారు. ఆ సమయంలో హోసన్నా... హోసన్నా అంటూ కీర్తిస్తూ ఆనయనను వెంబడించే పండుగే మట్టల పండుగ విశేషం.



వెపేరి తెలుగు చర్చీలో మట్టలు ప్రదర్శిస్తూ జయ గీతాలు ఆలపిస్తున్న భక్తులు

వేలాంకన్ని క్షేత్రంలో...

ఆరోగ్యమాత అమ్మవారు కొలువుదీరిన వేలాంకన్ని పుణ్యక్షేత్రంలో మతసామరస్యానికి నిదర్శనంగా మట్టల ఊరేగింపులో సర్వమతాల ప్రజలు పాల్గొన్నారు. మట్టలు చేతపట్టుకుని హోసన్నా.. హోసన్నా అంటూ కీర్తనలు ఆలపిస్తూ, జైజై ధ్వనాలతో సందడి చేశారు. ఉదయం 7 గంటల నుంచి ఈ ఆలయ ప్రాంగణంలో వేర్వేరుగా ఉన్న ప్రార్థనా మందిరాల్లో తమిళం, తెలుగు, హిందీ, ఆంగ్లం, కొంకణీ తదితర భాషల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వెపేరిలో...

స్థానిక వెపేరి హైరోడ్డులోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘం (ఎంసీటీబీసీ)లో సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన మట్టల ఆదివారం వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ గుంటూరుకు చెందిన రెవరెండ్ మూర్తిబాబు వాఖ్య పరిచర్య చేశారు. ముందుగా ఉదయం 8గంటలకు స్త్రీల సమాజం, సండే స్కూల్, క్వయర్, యూత్ విభాగాలకు చెందిన సభ్యులు మట్టలు చేతపట్టుకుని ఆలయ ప్రాంగణ పరిసరాల్లో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు, నూతన గీతాలతో క్రీస్తును స్తుతించారు. 17వ తేదీ సాయంత్రం 7 గంటలకు మాండీ గురువారం ఆరాధన, 18వ తేదీ ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు గుడ్‌ఫ్రైడే సందర్భంగా శిలువ ధ్యాన ఆరాధనలు, 20వ తేదీ ఈస్టర్ సందర్భంగా ఉదయం 4 గంటలకు పాతఃకాల ఆరాధన, ఉదయం 8గంటలకు పునరుత్థాన ఆరాధనలు జరుగుతాయని సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్ ప్రకటించారు. అధ్యక్షులు జి.రామయ్య, కోశాధికారి ఐ.మార్క్, ఇతర కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



విల్లివాక్కంలో రక్షణ సైన్యం మేజర్ నాగేశ్వరరావు సారథ్యంలో మట్టల ఊరేగింపు

అయినావరంలో...

స్థానిక ఐసీఎఫ్ సమీపంలోని అయినావరం రైల్వే క్వార్టర్స్‌లో ఉన్న రక్షణసైన్యం సంఘం ఆధ్వర్యంలో కోర్ కమాండింగ్ ఆఫీసర్లు లెఫ్టినెంట్ ఎం.ఇమ్మానియేలు - నివేదిత అధ్యక్షతన జరిగిన మట్టల ఊరేగింపులో పిల్లలు, పెద్దలు, సంఘ నిర్వాహకులు పాల్గొన్నారు. ఐసీటీ 2025 కోర్ సెక్రటరీ సూరిపోగు థామస్, కోర్ సార్జెంట్ మేజర్ చల్లగాలి నోవా, బలభద్ర సుమన్, సాల్మాన్, గోల్లపల్లి ప్రభుదాస్, తారా ఊర్మిలా, ఆరోగ్యమేరీ కిరణ్, ఎం.ఉమ, విన్సెంట్ మేరీ, ఆర్.మోనిక, ఏ.చిరంజీవి, ఎం.రమేష్, పి.పురుషోత్తం, ఎస్.సంగీత, జె.టాల్‌స్టాయ్ సారథ్యంలో క్వార్టర్స్‌లో వీధులగుండా ఊరేగింపు సాగింది. చివరగా ప్రపంచ దేశాల్లో శాంతి నెలకొనాలని, రోగుల స్వస్థత కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చూలైలో...

స్థానిక చూలై కాట్బూరు నల్లముత్తు వీధిలోని తెలుగు బాప్టిస్టు చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ పాల్ ఈశ్వరప్ప, రెవరెండ్ యేసుదాస్ సారథ్యంలో మట్టల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ చైర్మన్ జి.సురేష్‌కుమార్, వైస్ చైర్మన్ ఏ.లాబాను, కార్యదర్శి ఎండీ.వీరరాజు, ఉప కార్యదర్శి పి.ప్రభుదాస్, కోశాధికారి వి.యేసుదాస్, సంఘ పెద్దలు కె.జాన్సన్, వై.ముత్తుకుమార్, స్త్రీల సమాజం, సండే స్కూల్, యూత్ తదితర విభాగాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.



చూలైలో మట్టల ఊరేగింపులో తెలుగు క్రైస్తవులు

విల్లివాక్కంలో...

స్థానిక విల్లివాక్కంలో రక్షణసైన్యం సంఘం ఆధ్వర్యంలో జరిగిన మట్టల ఊరేగింపులో తెలుగు క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మేజర్ ఆర్.నాగేశ్వరరావు, మేజర్ ఎస్తేర్ రాణి సారథ్యంలో ప్రధాన వీధుల్లో సాగిన ఊరేగింపులో మట్టలతో పాల్గొన్న తెలుగు క్రైస్తవులు గీతాలు ఆలపిస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ వేడుకలో సంఘపెద్దలు, స్త్రీలు, సండే స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.



అయినావరం రైల్వే క్వార్టర్స్‌లో మట్టల ఊరేగింపులో పాల్గొన్న రక్షణ సైన్యం సేవకులు

హుషారుగా చేపల వేట



కుటుంబ సమేతంగా చేపలు పడుతున్న గ్రామస్తులు

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుపత్తూరు సమీపం పుళదిపట్టివిల్లి చెరువులో ఆదివారం వేకువజాము చేపలు పట్టే వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పుళదిపట్టి విల్లి చెరువు ఆయకట్టుకింద పంట పొలాలకు సాగునీటిని అందిస్తున్నారు. ఈ పెద్ద చెరువు వేసవిలో నీటి మట్టం తగ్గకమునుపే ఊరివారంతా కలిసి అందులోని చేపలను పట్టుకోవడం ఓ పండుగలా యేళ్ల తరబడి కొనసాగిస్తున్నారు. ఆ మేరకు ఆదివారం వేకువజామునే ఊరివారంతా కుటుంబ సమేతంగా వెళ్లి చేపలపట్టడంలో పోటీపడ్డారు. చిన్న వలలు, బుట్టలు చెరువునీటిలో వేసి చేపలను లాఘవంగా పట్టుకున్నారు. కడలా, రోగు, విరాలి, కండై వంటి మేలిరకం చేపలు మెండుగా లభించడంతో ఆనందం వ్యక్తం చేశారు. సుమారు 20 గ్రామాలకు చెందిన ప్రజలు ఈ చేపల వేటలో హుషారుగా పాల్గొన్నారు.

నేత్రపర్వం... సీతారాముల కల్యాణోత్సవం



తిరుత్తణి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలల్లో భాగంగా పల్లిపట్టు ఆంజనేయనగర్‌లోని వీర మంగళ ఆంజనేయస్వామి సమేత కల్యాణరామస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామునుంచే ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 6న ధ్వజారోహణంతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సీతారాముల కల్యాణోత్సవానికి పలు ప్రాంతాల నుంచి ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యలో భక్తులు పండ్లు, పూలు, పట్టువస్త్రాలతో ఆలయానికి చేరుకుని కల్యాణోత్సవాన్ని తిలకించి, పులకించిపోయారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఇందులో ఆలయ అర్చకులు రంజిత్‌శర్మ, ఆలయ నిర్వాహకులు శ్రీనివాసన్, హేమాద్రి, పురుషోత్తం, శివకుమార్, మోహన్‌రెడ్డి, లోకనాథన్, బాలా, దేవా, మోహన్, శరత్ పాల్గొన్నారు.



దర్శనం కోసం క్యూలైన్లలో పెద్దసంఖ్యలో బారులుతీరిన భక్తులు

తిరుచెందూరు ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి, వరుస సెలవురోజులు కావడంతో తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో ప్రసిద్ధి చెందిన సుబ్రమణ్యస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో ఆదివారం తరలి వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం సమీపంలో ఉన్న సముద్ర తీరంలో పుణ్యస్నానమాచరించి క్యూలైన్లలో సుమారు ఐదు గంటలకు పైగా వేచివుండి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. రద్దీని దృష్టిలో వుంచుకుని ఆలయ నిర్వాహకులు తెల్లవారుజామున 4గంటలకే ఆలయాన్ని తెరచి పూజలు నిర్వహించారు. 4.30 గంటలకు విశ్వరూప దర్శనం, ఉదయం 6గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, 10 గంటలకు మహా అభిషేకం తదితర పూజలను శివాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



రోడ్డు దాటుతున్న పులి

రోడ్డు పైకొచ్చిన పులి

పర్యాటకుల బెంబేలు

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముధుమలై శరణాలయం పరిధిలో వెళ్తున్న పర్యాటకులు, పులి రోడ్డు దాటడం గమనించి బెంబేలెత్తారు. నీలగిరి జిల్లా గూడలూరు సమీపం ముధుమలై పులుల శరణాలయం పరిధిలో పులులు,చిరుతలు, ఏనుగులు సహా పలు జంతువులున్నాయి.రాత్రి వేళల్లో జంతువులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుంటాయి. ఈ నేపథ్యంలో, శుక్రవారం అర్ధరాత్రి ఆ మార్గంగా వెళుతున్న పర్యాటకుల వాహనానికి పులి అడ్డుగా రావడంతో నిలిపివేశారు. పులి రోడ్డు దాటి మరో ప్రాంతానికి వెళ్లిన అనంతరం వాహనాలు బయల్దేరి వెళ్లాయి. పులి రోడ్డు దాటుతున్న దృశ్యాలు పలువురు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కాగా, రాత్రి వేళల్లో జంతువులు రోడ్డు దాటుతుంటాయని, ఆ సమయంలో వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని, అదే సమయంలో జంతువులను భయపెట్టేలా వ్యవహరించరాదని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఘనంగా ఉగాది పురస్కారాల వేడుకలు



ఉగాది పురస్కారగ్రహీతలతో పొన్నూరు రంగనాయకులు తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అడయార్ ఆర్య వైశ్య అసోసియేషన్ (ఏఏఏ) ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు, తమిళ ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అడయార్ ఇందిరానగర్‌లోని డెసెట్ రోజ్ హాల్ వేదికగా అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నూరు రంగనాయకులు సారథ్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు గౌరవ అతిథులుగా ఈక్విటాస్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ హరీష్ క్రిప, ఎస్కేపీడీ ఛారిటీ ట్రస్టీ ఎస్.ఎల్.సుదర్శనం, టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ అడ్వైజర్ సి.వి.సుబ్బారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న ఎం.అపర్ణ, డాక్టర్ బి.శారద, డాక్టర్ ఎన్.బాలాజీ, శరత్‌చంద్రకుమార్, వి.మురళీధర్‌కు ఉగాది పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ముందుగా రంగనాయకులు మాట్లాడుతూ... తమ అసోసియేషన్‌లో చాలా మంది ప్రముఖులు సభ్యులుగా ఉన్నారని, ప్రతినెలా సుప్రభాత సేవతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు, తమిళ ఉగాది పండుగలను ఒకే వేదికపై జరుపుకోవడం సంతోషకరమన్నారు. అసోసియేషన్ కార్యదర్శి అద్దంకి సుధాకర్, కోశాధికారి బయ్యా బాలాజి కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్య, కళలు, వైద్యం సహా వివిధ రంగాల్లో రాణించిన వారు 2026లో పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని యూజీసీ ప్రకటించింది. ఈ మేరకు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కార్యదర్శి ఆర్.మనీష్‌జోషి అన్ని ఉన్నత విద్యాసంస్థలకు సర్క్యులర్ పంపారు. 2026లో పద్మ అవార్డుల కోసం దరఖాస్తులు, సిఫారసులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. జూలై 31వ తేదిలోపు https://awards.gov.in/లో దరఖాస్తు చేసుకోవచ్చు. జాతి, వృత్తి, స్థానం, లింగంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు. ఈ అవార్డుకు ఉన్నత విద్యాసంస్థలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని యూజీసీ తెలిపింది.

సమాచార దర్శిని

నేడు తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాలకు సబర్బన్ రైళ్లు ఈనెల 14న సోమవారం తక్కువ సంఖ్యలో నడుపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది. తమిళ ఉగాది, అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు రోజు కావడంతో, ఆ రోజున ఆదివారం టైంటేబుల్ ప్రకారం, చెన్నై సెంట్రల్ - అరక్కోణం, చెన్నై సెంట్రల్ - గుమ్మిడిపూండి - సూళ్లూరుపేట, చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు మధ్య రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

కాశిమేడు చేపల మార్కెట్లో కొనుగోలుదారుల రద్దీ

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈనెల 15 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆదివారం రాయపురం సమీపంలోని కాశిమేడు చేపల మార్కెట్లో కొనుగోలుదారుల రద్దీ పెరిగింది. గత వారం కిలో రూ.700కు విక్రయించిన వంజరం చేపలు ఆదివారం రూ.800, ముక్కలు చేసిన వంజరం కిలో రూ.1,200 విక్రయించారు. హోటళ్లు, రిసార్టులు, టిఫిన్ సెంటర్ల యజమానులు, చిల్లర వ్యాపారుల రాకతో కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో సందడి నెలకొంది.

కన్నియాకుమారి అద్దాల వంతెనపై వెళ్లేందుకు నిషేధం

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి తిరువళ్లూర్ విగ్రహం - వివేకానంద స్మారక మండపం మధ్య ఏర్పాటు చేసిన అద్దాల వంతెనపై నడిచి వెళ్లేడానికి పర్యాటకులకు ఐదు రోజులు నిషేధం విధించారు. తిరువళ్లూర్ విగ్రహం - వివేకానంద రాక్ మధ్య రూ.37 కోట్లతో నిర్మించిన అద్దాల వంతెనను గత ఏడాది డిసెంబరు 30వ తేది సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఈ వంతెనపై వెళుతూ దిగువన సముద్ర అలలు వీక్షిస్తూ పర్యాటకులు ప్రత్యేక అనుభూతి పొందుతున్నారు. వంతెన మరమ్మత్ల కారణంగా ఈ నెల 15 నుంచి 19వ తేది వరకు పర్యాటకులను అనుమతించమని అధికారులు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ 'నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్' (ఎన్ఎంఎంఎస్) పథకంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్కాలర్ షిప్ అందిస్తున్నారు. ఈ సంవత్సరం ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫిబ్రవరి 22వ తేది నిర్వహించగా, సుమారు 2 లక్షల మంది రాశారు. ఈ పరీక్షా ఫలితాలను www.dge.tn.gov.inలో విడుదల చేశారు. స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హులైన 6,695 మంది జాబితా కూడా అదే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు.

ఎకో పార్కు ప్రాజెక్ట్ నివేదికకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ రేస్ కోర్స్‌ను ఎకో పార్క్‌గా మార్చడానికి ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేసేందుకు పర్యాటక శాఖ టెండర్లు ఆహ్వానించింది. రేస్ కోర్స్‌ను ఎకో పార్క్‌గా మార్చాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దాఖలు చేసిన బడ్జెట్‌లో రూ.70 కోట్లు కేటాయించింది. పార్కు ఏర్పాటుపై జిల్లా యంత్రాంగం, ఉద్యాన, అటవీ శాఖలను సంప్రదించి ప్రాజెక్ట్ నివేదిక దాఖలుకు టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

20న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 'ఏ మ్యాక్స్' అకాడమీ ఆధ్వర్యంలో 7వ రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ఈ నెల 20వ తేది మొగప్పేర్ వెస్ట్ నొలంబూర్‌లోని టెక్నథాన్ హాలులో జరుగనున్నాయి. అందులో 8,10,12,15,20 ఏళ్ల విభాగాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 18వ తేదిలోపు పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు నెం.9360553703, 9445632077లలో సంప్రదించవచ్చు.

ఎస్ఈటీసీలో ప్రైవేటు స్లీపర్ బస్సులు

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా ప్రైవేటు స్లీపర్ రకం బస్సులను అద్దెకు నడపాలని రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) నిర్ణయించింది. దీనిపై గత ఏడాది ప్రైవేటు బస్సు యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం విదితమే. ప్రస్తుతం విల్లుపురం ప్రభుత్వ రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా ఈ బస్సులు నడుపుతున్నారు. ఈ విషయమై ఎస్ఈటీసీ అధికారులు మాట్లాడుతూ... సెలవు రోజులు, పండుగ సమయాల్లో చెన్నై నుంచి దక్షిణ జిల్లాలు, సేలం, కోవై ప్రాంతాలకు ఎక్కువ బస్సులు నడపాల్సి వస్తుందని అందుకోసం ప్రైవేటు బస్సులు అద్దెకు తీసుకొని నడపాలని నిర్ణయించామన్నారు. గత ప్రైవేటు బస్సులకు కి.మీకు రూ.51.25 అద్దెగా నిర్ణయించామన్నారు. అలాగే, 20 స్లీపర్ రకం ప్రైవేటు బస్సులు 'ప్రభుత్వ ఒప్పందం బస్సు' అనే పేరుతో నడుపనున్నామన్నారు. ప్రభుత్వ బస్సులు కి.మీ రూ.65 చొప్పున అద్దెకు ఇస్తున్న నేపథ్యంలో, ప్రైవేటు స్లీపర్ బస్సుకు కి.మీ రూ.55గా ఇవ్వనుండగా, సంస్థకు రూ.10 ఆదా అవుతోందని అధికారులు తెలిపారు.

రైళ్లలో తీసుకెళ్లే అదనపు లగేజీకి ఛార్జీ

దక్షిణ రైల్వే

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అనుమతించిన దానికన్నా అధిక లగేజీ తీసుకెళ్లే ప్రయాణికుల నుంచి ఛార్జీ వసూలు చేయాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. సాధారణ, ఏసీ ప్రథమ శ్రేణి తరగతి ప్రయాణికులు 70 కిలోల వరకు, ఏసీ టూ టైర్ ప్రయాణికులు 50 కిలోలు, ఏసీ 3 టైర్ ప్రయాణికులు 40 కిలోలు, స్లీపర్ బోగీ ప్రయాణికులు 40 కిలోలు, సాధారణ బోగీల్లో ప్రయాణించే వారు 35 కిలోల వరకు లగేజీ తీసుకెళ్లేందుకు అనుమతిస్తున్నారు. అనుమతించిన దానికన్నా అదనపు లగేజీ తీసుకెళ్లే ప్రయాణికుల నుంచి 10 నుంచి 15 కిలోల వరకు ఒకటిన్నర రెట్లు లగేజీ ఛార్జీ వసూలు చేయనున్నారు. టీసీలు లగేజీ తీసుకెళ్లడాన్ని పర్యవేక్షిస్తారని దక్షిణ రైల్వే తెలిపింది.

అరుణాచల గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తజనం



గిరిప్రదక్షిణలో అశేష భక్తజనం

వేలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పంచభూత లింగాల్లో ఒకటైన అగ్నిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన తిరువణ్ణామలై క్షేత్రంలో గిరిప్రదక్షిణకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రతి పౌర్ణమికి అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో చైత్రాపౌర్ణమిని పురస్కరించుకుని గిరిప్రదక్షిణంలో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. శనివారం ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి గిరిప్రదక్షిణ పూర్తిచేసుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఈ గిరిప్రదక్షిణలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొండచుట్టూ తాగునీరు, చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

గిరిప్రదక్షిణకు అనుకూల సమయాలు...

- మే 11వ తేదీ ఆదివారం రాత్రి 8.01 గంటల నుంచి సోమవారం రాత్రి 10.25 గంటల వరకు.
- జూన్ 10వ తేదీ మంగళవారం ఉదయం 11.35 గంటల నుంచి 11న బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు.
- జులై నెల 11 గురువారం ఉదయం 11.35 గంటల నుంచి 12న శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు.
- ఆగస్టు 8 శుక్రవారం మధ్యాహ్నం 2.12 గంటల నుంచి 9న శనివారం మధ్యాహ్నం 1.24 గంటల వరకు.
- సెప్టెంబరు 7 ఆదివారం మధ్యాహ్నం 1.41 గంటల నుంచి 8న సోమవారం రాత్రి 11.38 గంటల వరకు
- అక్టోబరు 6 సోమవారం మధ్యాహ్నం 12.23 గంటల నుంచి 7న మంగళవారం ఉదయం 9.16 గంటల వరకు
- నవంబరు4 మంగళవారం రాత్రి 10.26 గంటల నుంచి 5న బుధవారం సాయంత్రం 6.48 గంటల వరకు
- డిసెంబరు4 గురువారం రాత్రి 8.37 గంటల నుంచి 5న శుక్రవారం తెల్లవారుజామున 4.43 గంటల వరకు.

అన్నాడీఎంకే - బీజేపీ కూటమిని విమర్శిస్తే ఖబడ్దార్!

● మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఏర్పడిన అన్నాడీఎంకే - బీజేపీ కూటమిని విమర్శిస్తే రాష్ట్రవ్యాప్త ధర్నాలు చేపడతామని మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ హెచ్చరించారు. అసెంబ్లీ ప్రతిపక్ష ఉపనేత, అన్నాడీఎంకే సీనియర్ నేత ఆర్బీ ఉదయకుమార్ మదురైలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ఏర్పాటైన కూటమిలో బీజేపీ, తమిళ మానిల కాంగ్రెస్, పురచ్చి భారతం తదితర పార్టీలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చరిత్రాత్మక విజయాన్ని సాధించి డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతాయన్నారు. డీఎంకే ప్రభుత్వం అధికారాన్ని దుష్ప్రయోగం చేసి ప్రజలకు ఎలాంటి సేవలు చేయలేదని, అందువల్లే ప్రజలు రాష్ట్రప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. నిఘా విభాగం ఎన్డీఏ కూటమికి రోజురోజు పెరుగుతున్న ప్రజాదరణ గురించి తెలియజేసిందన్నారు. ఇది చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిపక్షాలపై దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. ఒక్క టాస్మాక్ సంస్థలోనే రూ.39,000 కోట్లకు పైగా అవినీతి జరిగిందని చెబుతున్నారని, రాష్ట్రంలో పాలారు నదికి బదులుగా సారా ఏరులై ప్రవహిస్తోందని ఉదయకుమార్ ఎద్దేవా చేశారు.

ఏడాదిలోగా డీఎండీకేను బలోపేతం చేస్తా

● విజయ్ ప్రభాకరన్



ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డీఎండీకేను ఏడాదిలోగా బలోపేతం చేసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లలో గెలిపించేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత కుమారుడు విజయ్ ప్రభాకరన్ పేర్కొన్నారు. తంజావూరు జిల్లా ఒరత్తనాడులో జరిగిన పార్టీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... తన తండ్రి షూటింగ్, రాజకీయ కార్యక్రమాలకు వెళ్లే సమయంలో తాను వెళుతుండేవాడినని, ఆయన మృతి అనంతరం ఆయన బాటలోనే ఇప్పటికి పయనిస్తున్నానని తెలిపారు. కెప్టెన్ వారసుడిగా రాష్ట్రప్రజలు తనను చూస్తున్నారని, వారికి అంకితభావంతో సేవ చేయదలచుకున్నానని, ఇది నెరవేరాలంటే పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత తనకు ఉందని విజయ్ ప్రభాకరన్ చెప్పారు.

ఆకట్టుకుంటున్న వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



స్టాల్ వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతాప్

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ రైతు బజార్‌లో ఆదివారం జిల్లా కలెక్టర్ ప్రతాప్ ప్రారంభించిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. తిరువళ్లూర్ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ, వాణిజ్య పన్నుల శాఖ, జిల్లా ప్రకృతి రైతుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను రైతు బజార్‌లో ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనలో ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలు, పండ్లు, సన్నరకం బియ్యం, సంబా బియ్యం, వయాగ్రా బియ్యం, బ్లాక్ గ్రౌండ్ రైస్, దంపుడు బియ్యం తదితర అన్నిరకాల బియ్యం ప్రదర్శనలో కొలువుదీర్చారు. క్రిమిసంహారక మందులు వాడని ఆహారాన్ని ప్రజలకు అందజేయాలన్న సంకల్పంతో ఈ ప్రదర్శన ఏర్పాటుచేసినట్లు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కళావతి పేర్కొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



లోకేష్‌కు అవార్డు అందజేస్తున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ డైరెక్టర్ రవివర్మన్

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ హెడ్గేవర్ స్మారక సమితి ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక చెట్‌పేట్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా తమిళనాడు - పుదుచ్చేరి ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ రవివర్మన్ పాల్గొన్నారు. సమాజంలో తేడాలను తొలగించి, ఐక్యతను నెలకొల్పి, దేశం, ధర్మం పట్ల మమకారం బలపరిచేలా సేవలందిస్తున్న లోకేష్, విమల్ అయ్యాస్వామి, ఏ.మురుగానందం, డి.మణికంఠన్, ఆర్.రాజేంద్రప్రసాద్‌కు అవార్డులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో తిరుకులత్తార్ పేరవై ఆర్గనైజర్ పేరరు లారన్, ఆర్ఎస్ఎస్ ఆర్గనైజర్ ప్రజోపకుమార్, సమితి చైర్మెన్ సురేష్‌రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహం చేసుకుంటానంటూ...

వృద్ధుడిని మోసం చేసిన మహిళ అరెస్ట్



గీత

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వివాహం పేరుతో 63 ఏళ్ల వృద్ధుడిని మోసం చేసిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువణ్ణామలై జిల్లా సేత్తుపట్టు తాలూకాకు చెందిన సిద్ధ వైద్యుడు రామనాథన్(63) థౌజండ్ లైట్స్ పోలీస్ స్టేషన్‌లో అందజేసిన ఫిర్యాదులో వివరాలు ఇలా ఉన్నాయి. తన భార్య 15 ఏళ్ల క్రితం వేరుగా వెళ్లిపోయింది. ఇద్దరు కుమార్తెలకు వివాహమై వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. వృద్ధాప్యం కారణంగా తోడు ఉండాలని భావించి, నిరుపేద వితంతు వధువు కోసం ప్రకటన చేశాను. ఈ ప్రకటన చూసిన అరుంబాక్కానికి చెందిన గీత(57) తనను సంప్రదించి వివాహం చేసుకునేందుకు సమ్మతించింది. ఈనెల 4వ తేది వివాహం చేసుకుందామని తెలపడంతో, 2.5 గ్రాముల మంగళ సూత్రం, జత వెండి మెట్టెలు, పట్టుచీర అందజేశారు. అదే రోజు థౌజండ్ లైట్స్‌లోని ఓ ఆస్పత్రిలో తన బంధువు చికిత్స పొందుతున్నాడని, చూసి వద్దామని తెలపవడంతో వెళ్లాను. బాత్రూంకు వెళ్లి వస్తానని చెప్పడంతో తాను వరండాలో వేచి ఉన్నాను. గంటలు గడిచినా ఆమె రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి ఫిర్యాదు చేసినట్టు రామనాథన్ పేర్కొన్నారు. కేసు నమోదుచేసిన పోలీసులు గీతను శనివారం అరెస్ట్ చేశారు. ఇదే విధంగా వివాహం పేరుతో గీత పలువురిని మోసం చేసినట్టు పోలీసుల విచారణలో తెలిసింది.

పరీక్షా కేంద్రం తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు ప్రభుత్వ ముస్లిం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం జాతీయ భద్రతా కేంద్రం, సముద్రతీర ఉపకేంద్రాలకు సంబంధించి జరిగిన రాతపరీక్షలను కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పరీక్షా కేంద్రంలోని అభ్యర్థులకు పరీక్ష బాగా రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారి రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో భాగస్వామ్యం

● కాంగ్రెస్ పోస్టర్ కలకలం



కాబోయే డిప్యూటీ సీఎం సెల్వపెరందగై అంటూ నగరంలో వెలిసిన పోస్టర్లు

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు నగరంలో అంటించిన పోస్టర్లు డీఎంకే కూటమి నేతలను దిగ్భ్రాంతికి గురిచేసింది. 2026లో తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ)అధ్యక్షుడు సెల్వపెరందగైని కాబోయే డిప్యూటీ సీఎంఅంటూ ఆపోస్టర్‌లో ముద్రించి ఉండడం కలకలం రేపింది. స్థానిక వడపళని, నందనం, అన్నాసాలై, రాయపేట, ఎగ్మూర్ తదితర పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు వెలిశాయి. మంత్రివర్గంలో చోటు కల్పించాలంటూ డీఎంకే కూటమిలో కొనసాగుతున్న డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ సీఎం స్టాలిన్‌పై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో, తన పేరుతో పోస్టర్ అంటించిన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఏవీఎం షరీఫ్‌ను వివరణ కోరుతూ సెల్వపెరంతగై ఉత్తర్వులు జారీచేశారు.

అన్నాడీఎంకే-బీజేపీలది సూపర్ హిట్ కూటమి

● సినీ నటి నమిత



ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అన్నాడీఎంకే-బీజేపీ కూటమి సూపర్‌హిట్ అవుతుందని ప్రముఖ నటి, బీజేపీ నిర్వాహకురాలు నమిత చెప్పారు. ఆమె ఆదివారం చెన్నైలో మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఇటీవల కుదుర్చుకున్న ఒప్పందం రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సూపర్‌హిట్ అవుతుందన్నారు. కూటమి గెలుపు కోసం పార్టీ అధిష్ఠానం కేటాయించే ప్రాంతాల్లో తాను విస్తృత ప్రచారంలో పాల్గొంటానని నమిత తెలిపారు.

వీఐటీలో వైస్‌చైర్మన్ జన్మదిన వేడుకలు



వేలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు వీఐటీలో ఆ కళాశాల వైస్ చైర్మన్ శంకర్ విశ్వనాథన్ జన్మదిన వేడుకలు ఆదివారం ఉదయం కళాశాల విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ విశ్వనాథన్‌కు పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో ఆయన కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ అధ్యక్షుడు జనార్దనన్, శ్రీనివాసన్, విజయకుమారి, డాక్టర్ దీనబంధు, పళణి, తనిగైసెల్వం తదితరులు పాల్గొని శంకర్ విశ్వనాథన్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫైర్‌మన్ విక్రమ్ సేవలు అభినందనీయం



విక్రమ్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న విజయ్‌కుమార్

వేలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు అగ్నిమాపక శాఖలో సేవలందించి ఇటీవల రిటైర్డ్ అయిన ఫైర్‌మన్ విక్రమ్ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని ఫైర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ కొనియాడారు. ఆదివారం ఉదయం అగ్నిమాపక శాఖ కార్యాలయంలో విక్రమ్‌కు శాలువా కప్పి అభినందించారు. తన జీవితంలోని సగభాగం తిరుత్తణి, తిరువళ్లూరు, చెన్నై, తాంబరం తదితర ప్రాంతాల్లో సేవలందించినట్లు ఈ సందర్భంగా విక్రమ్ చెప్పారు. అగ్నిప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలో అవగాహన కల్పిస్తూ తాను రాసిన పుస్తకం సమాజానికి ఎంతో ఉపయోగకరమని చెప్పారు.

ఆర్కే బిల్డర్స్ అన్నదానం



అన్నదానంలో నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని కాట్పాడి సెంగోట్టైలో పౌర్ణమి సందర్భంగా ఆర్కే బిల్డర్స్ ఆధ్వర్యంలో వేలూరు 1వ వార్డు డీఎంకే సభ్యుడు, ఆర్కే బిల్డర్స్ అధినేత అన్బు ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేశారు. ఇందులో మండల డీఎంకే ఉపాధ్యక్షుడు సచ్చిదానందం, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలై వద్ద బస్సును ఢీకొన్న కారు

నలుగురు లారీ యజమానుల మృతి



ప్రమాదంలో ధ్వంసమైన కారు - మృతి చెందిన శైలేష్‌కుమార్, సతీష్‌కుమార్, సరోఫ్, స్టాలిన్(ఫైల్‌ఫొటోలు)

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై సమీపం కీళ్‌పెన్నాత్తూరు వద్ద ఆదివారం వేకువజాము జరిగిన రోడ్డు ప్రమాదంలో పుదుచ్చేరికి చెందిన నలుగురు లారీ యజమానులు మృతి చెందారు. పుదుచ్చేరికి చెందిన స్టాలిన్, సతీష్‌కుమార్, శైలేష్‌కుమార్, సరోఫ్ లారీ యజమానులు. సొంతపనుల నిమిత్తం రెండు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లారు. పనులు ముగించుకుని కారులో పుదుచ్చేరికి బయలుదేరారు. ఆ కారు ఆదివారం వేకువజాము తిరువణ్ణామలై మీదుగా పుదుచ్చేరికి వెళ్తుండగా కీళ్‌పెన్నాత్తూరు సమీపం కాట్టుకుప్పం వద్ద ప్రభుత్వ రవాణా సంస్థ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణించిన నలుగురూ దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న కీళ్‌పెన్నాత్తూరు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కారు శిథిలాల మధ్య చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక విచారణలో తేలింది.

బాలికలపై లైంగిక వేధింపుల కేసులో

పాస్టర్ అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కోవైలో ఇద్దరు చిన్నారులను లైంగికంగా వేధించిన పాస్టర్ జాన్ జెబరాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తుడియలూరు జీయన్ మిల్స్‌కి చెందిన జాన్ జెబరాజ్ (37) ఆయన ఇంట్లో ఇటీవల జరిగిన విందులో పాల్గొన్న 14, 17 ఏళ్ల బాలికలను లైంగింక వేధించినట్టు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, ఆయన్ను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేయగా ఆయన పరారయ్యాడు. ఆయన విదేశాలకు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. ఇదిలా ఉండగా, ఆదివారం తెల్లవారుజామున కేరళ రాష్ట్రం మూన్నారులో దాగిన జెబరాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన్ను రాష్ట్రానికి తీసుకొచ్చి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వులతో ఆయన్ను రిమాండ్‌కు తరలించారు.

ఉత్తరాది యువకుల నుంచి జీ-పే ద్వారా దోపిడీ

● ఇద్దరు ఆటో డ్రైవర్ల అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది యువకుల నుంచి జీ-పే ద్వారా నగదు దోపిడీకి పాల్పడిన ఇద్దరు ఆటో డ్రైవర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వినోద్‌సింగ్ తన స్నేహితులతో కలసి చెన్నైలో ఉపాధి కోసం వచ్చారు. సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగిన వారు మధురవాయల్ వెళ్లేందుకు రెండు ఆటోలు మాట్లాడుకున్నారు. అమింజికరై సుబ్బరాయన్ వీధిలో వెళుతున్న ఆటోలను ఒక్కసారిగా ఆపిన ఇద్దరు డ్రైవర్లు, జార్ఖండ్ యువకులను బెదిరించి వారి నుంచి జీ-పే ద్వారా 3,800 తయ ఖాతాలో జమచేసుకొని వారిని అక్కడే వదిలి వెళ్లిపోయారు. ఈ విషయమై బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన అమింజికరై పోలీసులు పుదుపేటకు చెందిన విజయ్, ఒట్టేరికి చెందిన సంతోష్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

మిక్సీ వేస్తుండగా షాక్

మహిళ మృతి

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మిక్సీ వేస్తున్న మహిళ విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. తిరువారూరు జిల్లా పిన్నవాసల్ కి చెందిన సింధుభైరవి, తన 8 నెలల బిడ్డకు ఆహారం మెత్తగా చేసేందుకు మిక్సీలో వేసింది. ఆ సమయంలో ఊహించని విధంగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జల్లికట్టు ఎద్దు దాడి: ప్రేక్షకుడి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు పోటీలు వీక్షిస్తున్న వ్యక్తిపై ఎద్దు దాడి చేయడంతో ప్రేక్షకుడు మృతిచెందాడు. ఈ ఘటన పుదుకోటలో జరిగింది. మీనంపట్టిలో శనివారం జల్లికట్టు పోటీలు జరిగాయి. వివిధ జిల్లాలకు చెందిన ఎద్దులు పోటీలో పాల్గొనగా, వాటిని అదుపు చేసేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ పోటీలు వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ క్రమంలో, పోటీలు చూస్తున్న మారిముత్తుపై జల్లికట్టు ఎద్దు దాడి చేయడంతో ఆయన ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వాహన తనిఖీల్లో రూ.7 లక్షల స్వాధీనం

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్‌లో వాహన తనిఖీల్లో రూ.7 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు, యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శనివారం రాత్రి ట్రిప్లికేన్ పల్లవన్ హౌస్ జంక్షన్‌లో వాహనతనిఖీలు చేపట్టిన పోలీసులు, ఆ మార్గంలో వేగంగా ద్విచక్రవాహనంలో వచ్చిన షేక్ నసీరుద్దీన్ (27)ని అడ్డుకున్నారు. అతని బ్యాగు తనిఖీ చేయగా అందులో రూ.7 లక్షల నగదు గుర్తించారు. నగదుకు సంబంధించి అతని వద్ద ఎలాంటి రసీదులు లేకపోవడంతో యువకుడిని విచారిస్తున్నారు.

నీటమునిగి విద్యార్థి మృతి



కుమరేశన్ (ఫైల్ ఫొటో)

తిరుత్తణి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చెరువులో ఈతకు వెళ్లిన ప్లస్‌టూ విద్యార్థి నీటమునిగి మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా పొదటూర్‌పేట కామరాజర్ నగర్ 2వ వీధికి చెందిన నేత కార్మికుడు అన్నామలై కుమారుడు కుమరేశన్ (16) అక్కడి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 11వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కారణంగా ఉదయం 10 గంటల సమయంలో స్నేహితులతో కలిసి ఊరి చివర ఉన్న చెరువులో స్నానానికి వెళ్ళాడు. ఈ నేపథ్యంలో లోతులోకి వెళ్ళిపోయిన కుమరేశన్ ఉన్నట్టుండి మునిగిపోయాడు. కొంతమంది కుమరేశన్‌ను నీటి నుంచి వెలుపలికి తీసి, సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు కుమరేశన్ మృతి చెందినట్లు ధృవీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బస్సుల్లో 3.32 లక్షల మంది పయనం

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవులు, తమిళ ఉగాది సందర్భంగా నడుపుతున్న ప్రత్యేక బస్సుల్లో మూడు రోజుల్లో 3.32 లక్షల మంది ప్రయాణించినట్టు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) పేర్కొంది. వారాంతపు, పండుగ సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం కిలాంబాక్కం, కోయంబేడు, మాధవరం తదితర ప్రాంతాల నుంచి సాధారణంగా నడిపే 2,092 బస్సులతో పాటు అదనంగా 1,153 సర్వీసులు నడిపినట్టు పేర్కొంది. ఈ నెల 11వ తేది నుండి ఆదివారం వేకువజామున 2 గంటల వరకు నడిపిన 6,049 బస్సుల్లో 3,32,695 మంది ప్రయాణించినట్టు ఎస్ఈటీసీ తెలిపింది.





ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయంలో వార్షిక బ్రహోత్సవాల ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు




ప్రత్యేక అంకరణలో స్వామివారి మూలవిరాట్టు



'సర్దార్-2'లో కార్తి - సూర్య

తుది దశ చిత్రీకరణలో 'సర్దార్-2'

పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' తుది దశ చిత్రీకరణ పనులను జరుపుకుంటోంది. ఇటీవల మైసూర్‌లో షూటింగ్ జరుగుతుండగా, హీరో కార్తి కాలికి గాయమైన విషయం తెల్సిందే. దీంతో షూటింగ్‌ను తాత్కాలికంగా వాయిదావేశారు. ప్రస్తుతం ఆయన కోలుకోవడంతో తిరిగి షూటింగ్ ప్రారంభించి, చివరి దశ నిర్మాణ పనులను శరవేగంగా జరుపుతున్నారు.మైసూర్ షెడ్యూల్ పూర్తయ్యాక మరికొన్ని సన్నివేశాలను చెన్నైతో పాటు విదేశాల్లో జరిపే షూటింగుతో పూర్తికానుంది.ఈ చిత్రంలో ప్రముఖ దర్శక నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల అధికారికంగా వెల్లడించారు. ఇందులో రజిషా విజయన్, అరుణ్, ఆషికా రంగనాథ న్ తదితరులు నటించగా, జార్జి విలియమ్స్ ఛాయాగ్రహణం అందించగా, శ్యామ్ సీఎస్ సంగీత బాణీలను సమకూర్చుతున్నారు.



రూ.100 కోట్ల క్లబ్‌లో 'గుడ్ బ్యాడ్ అగ్లీ'

అగ్రనటుడు అజిత్ కుమార్ హీరోగా, అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీ ఈనెల 10న విడుదలై ఘన విజయం సాధించడంతో పాటు ఈ యేడాది రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన మరో చిత్రంగా నిలిచింది. తమిళం, తెలుగు భాషల్లో విడుదలైన ఈ చిత్రం అన్ని చోట్లా ప్రేక్షకుల పాజిటివ్ టాక్ లభించింది. దీంతో భారీ కలెక్షన్లను రాబడుతోంది. ఫలితంగా అజిత్ కెరీర్‌లో కేవలం రెండు రోజుల్లో రూ.100 కోట్లు దాటిన తొలి మూవీగా రికార్డు సృష్టించింది. శనివారం నుంచి సోమవారం వరకు వరుస సెలవులు కావడం, మరో మంచి మూవీ లేకపోవడంతో ఈ సినిమాకు కలెక్షన్లు మరింతగా పెరిగే అవకాశం ఉందని సినీ ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ఈ మూవీలో అజిత్, ప్రసన్న, అర్జున్ దాస్, సునీల్, ప్రియా ప్రకాష్ వారియర్, యోగిబాబు తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించగా, రోమియో పిక్చర్స్ విడుదల చేసింది.

యువ హీరోతో మలయాళ బ్యూటీ డేటింగ్?



తమిళ చిత్రజ్యోతి

మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్, కోలీవుడ్ యువ హీరో ధృవ్ విక్రమ్ డేటింగ్‌లో ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. దీనికి బలమైన కారణం లేకపోలేదు. ఈ హీరోహీరోయిన్లు గాఢచుంబనంలో మునిగితేలుతున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇందుకు నిదర్శనం. అయితే, ఇందులో వాస్తమెంతో వారిద్దరే వెల్లడించాల్సి ఉంది. ఎందుకంటే, వీరిద్దరు కలిసి 'బైసన్'లో నటిస్తున్నారు. మారి సెల్వరాజ్ దర్శకుడు. ఇందులో ధృవ్ విక్రమ్ కబడ్డీ ఆటగాడిగా కనిపించనున్నారు. ఇందులో అనుపమ పరమేశ్వరన్ అతని ప్రియురాలి పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా కోసం వీరిద్దరూ ముద్దుపెట్టుకున్నట్టుగా తీసిన ఫొటోనా? లేక నిజంగానే వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నపుడు తీసిన ప్రైవేట్ ఫొటోనా? అని తేలాల్సివుంది. ఈ ఫొటో మాత్రం ఇపుడు కోలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇదిలావుండగా, సీనియర్ హీరో చియాన్ విక్రమ్ తనయుడే ధృవ్ విక్రమ్.



ధృవ్ విక్రమ్ - అనుపమ పరమేశ్వరన్

భారీ ధరకు 'జన నాయగన్' రైట్స్ విక్రయం?



అగ్రహీరో విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'జన నాయగన్'. హెచ్. వినోద్ దర్శకుడు. ఈ చిత్రం తమిళ పంపిణీ హక్కులను భారీ ధరకు ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ రోమియో పిక్చర్స్ కొనుగోలు చేసినట్టు కోలీవుడ్ సినీ ట్రేడ్ వర్గాల సమాచారం. నిజానికి ఈ మూవీ రైట్స్‌ను సొంతం చేసుకునేందుకు పలు సంస్థలు పోటీపడ్డాయి. ఎస్ఎస్ లలిత్ కుమార్, రాహుల్ వంటి బడా నిర్మాతలు పోటీపడగా, ఇందులో రోమియో పిక్చర్స్ అధినేత రాహుల్ సొంతం చేసుకున్నట్టు సమాచారం. ఈయన గతంలో విజయ్ నటించిన 'ది గోట్' మూవీ రైట్స్‌ను సొంతం చేసుకుని ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. దీంతో 'జన నాయగన్' రైట్స్ విషయంలోనూ మేకర్స్ ఆయనకే ప్రాధాన్యం ఇచ్చినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. అయితే, ఈ డీల్‌పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తుండగా, పూజా హెగ్డే హీరోయిన్. ఇతర పాత్రల్లో గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రియమణి, మమిత బైజు తదితరులు నటించారు. సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూర్చుతున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



నాగపట్టినం జిల్లా వేలాంకన్ని మేరీమాత చర్చి ప్రాంగణంలో మట్టల ఊరేగింపు

● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పండుగకు ముందుగా వచ్చే ఆదివారాన్ని క్రైస్తవులు రాష్ట్రవ్యాప్తంగా మట్టల పండుగగా ఘనంగా జరుపుకున్నారు. మట్టలు చేతపట్టుకుని 'హోసన్నా.. హోసన్నా' అంటూ పాడుతూ సందడి చేశారు. నాగపట్టినం జిల్లా వేలాంకన్ని, చెన్నైలోని వెపేరి, పెరంబూరు, అయినావరం, న్యూమోడల్ లైన్, నజరేత్‌పురం, కొరుక్కుపేట, చిగురింతపాళెం, చూలై తదితర తెలుగు క్రైస్తవులు అధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో మట్టల ఆదివారం సందర్భంగా మట్టలతో ఊరేగింపులో పాల్గొని యేసుక్రీస్తును స్తుతించారు. యేసుక్రీస్తు మరణం, పునరుత్థానం, అద్వితీయమైన ఘట్టాలుగా విశ్వసిస్తున్న క్రైస్తవులు వాటిని స్మరించుకుంటూ క్రీస్తు మరణానికి ముందే 40 రోజులను శ్రమదినాలుగా పాటిస్తున్నారు. ఈ రోజుల్లో ఉపవాసాలు చేపట్టి దానధర్మాలు చేయడం, ఇతరుల పట్ల స్నేహపూర్వకమైన వంటి నియమాలు పాటిస్తారు. కాగా, జనోద్ధరణ కోసం క్రీస్తు శిలువపై మరణించడాన్ని గుడ్‌ఫ్రైడే, ఆ తర్వాత మూడో రోజున తిరిగి ప్రాణాలతో లేచిన ఘట్టాన్ని పునరుత్థాన (ఈస్టర్) పండుగగా ఏటా జరుపుకుంటున్నారు. పస్కా పండుగ సందర్భంగా యేసు ప్రభువు బేతనియ నుంచి జేరూసలేం పట్టణానికి చేరుకుని అక్కడ గాడిదపై ఎక్కి ప్రజలను పలకరించేందుకు బయలుదేరుతారు. ఇది గమనించిన ప్రజలు అనేక మంది మట్టలు, తమ వస్త్రాలు నేలపై పరచి ప్రభువును ఆహ్వానిస్తారు. ఆ సమయంలో హోసన్నా... హోసన్నా అంటూ కీర్తిస్తూ ఆనయనను వెంబడించే పండుగే మట్టల పండుగ విశేషం.



వెపేరి తెలుగు చర్చిలో మట్టలు ప్రదర్శిస్తూ జయ గీతాలు ఆలపిస్తున్న భక్తులు

వేలాంకన్ని క్షేత్రంలో...

ఆరోగ్యమాత అమ్మవారు కొలువుదీరిన వేలాంకన్ని పుణ్యక్షేత్రంలో మతసామరస్యానికి నిదర్శనంగా మట్టల ఊరేగింపులో సర్వమతాల ప్రజలు పాల్గొన్నారు. మట్టలు చేతపట్టుకుని హోసన్నా.. హోసన్నా అంటూ కీర్తనలు ఆలపిస్తూ, జైజై ధ్వనాలతో సందడి చేశారు. ఉదయం 7 గంటల నుంచి ఈ ఆలయ ప్రాంగణంలో వేర్వేరుగా ఉన్న ప్రార్థనా మందిరాల్లో తమిళం, తెలుగు, హిందీ, ఆంగ్లం, కొంకణీ తదితర భాషల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వెపేరిలో...

స్థానిక వెపేరి హైరోడ్డులోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘం (ఎంసీటీబీసీ)లో సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన మట్టల ఆదివారం వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ గుంటూరుకు చెందిన రెవరెండ్ మూర్తిబాబు వాఖ్య పరిచర్య చేశారు. ముందుగా ఉదయం 8గంటలకు స్త్రీల సమాజం, సండే స్కూల్, క్వయర్, యూత్ విభాగాలకు చెందిన సభ్యులు మట్టలు చేతపట్టుకుని ఆలయ ప్రాంగణ పరిసరాల్లో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు, నూతన గీతాలతో క్రీస్తును స్తుతించారు. 17వ తేదీ సాయంత్రం 7 గంటలకు మాండీ గురువారం ఆరాధన, 18వ తేదీ ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు గుడ్‌ఫ్రైడే సందర్భంగా శిలువ ధ్యాన ఆరాధనలు, 20వ తేదీ ఈస్టర్ సందర్భంగా ఉదయం 4 గంటలకు పాతఃకాల ఆరాధన, ఉదయం 8గంటలకు పునరుత్థాన ఆరాధనలు జరుగుతాయని సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్ ప్రకటించారు. అధ్యక్షులు జి.రామయ్య, కోశాధికారి ఐ.మార్క్, ఇతర కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



విల్లివాక్కంలో రక్షణ సైన్యం మేజర్ నాగేశ్వరరావు సారథ్యంలో మట్టల ఊరేగింపు

అయినావరంలో...

స్థానిక ఐసీఎఫ్ సమీపంలోని అయినావరం రైల్వే క్వార్టర్స్‌లో ఉన్న రక్షణసైన్యం సంఘం ఆధ్వర్యంలో కోర్ కమాండింగ్ ఆఫీసర్లు లెఫ్టినెంట్ ఎం.ఇమ్మానియేలు - నివేదిత అధ్యక్షతన జరిగిన మట్టల ఊరేగింపులో పిల్లలు, పెద్దలు, సంఘ నిర్వాహకులు పాల్గొన్నారు. ఐసీటీ 2025 కోర్ సెక్రటరీ సూరిపోగు థామస్, కోర్ సార్జెంట్ మేజర్ చల్లగాలి నోవా, బలభద్ర సుమన్, సాల్మాన్, గోల్లపల్లి ప్రభుదాస్, తారా ఊర్మిలా, ఆరోగ్యమేరీ కిరణ్, ఎం.ఉమ, విన్సెంట్ మేరీ, ఆర్.మోనిక, ఏ.చిరంజీవి, ఎం.రమేష్, పి.పురుషోత్తం, ఎస్.సంగీత, జె.టాల్‌స్టాయ్ సారథ్యంలో క్వార్టర్స్‌లో వీధులగుండా ఊరేగింపు సాగింది. చివరగా ప్రపంచ దేశాల్లో శాంతి నెలకొనాలని, రోగుల స్వస్థత కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చూలైలో...

స్థానిక చూలై కాట్టూరు నల్లముత్తు వీధిలోని తెలుగు బాప్టిస్టు చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ పాల్ ఈశ్వరప్ప, రెవరెండ్ యేసుదాస్ సారథ్యంలో మట్టల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ చైర్మన్ జి.సురేష్‌కుమార్, వైస్ చైర్మన్ ఏ.లాబాను, కార్యదర్శి ఎండీ.వీర్రాజు, ఉప కార్యదర్శి పి.ప్రభుదాస్, కోశాధికారి వి.యేసుదాస్, సంఘ పెద్దలు కె.జాన్సన్, వై.ముత్తుకుమార్, స్త్రీల సమాజం, సండే స్కూల్, యూత్ తదితర విభాగాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.



చూలైలో మట్టల ఊరేగింపులో తెలుగు క్రైస్తవులు

విల్లివాక్కంలో...

స్థానిక విల్లివాక్కంలో రక్షణసైన్యం సంఘం ఆధ్వర్యంలో జరిగిన మట్టల ఊరేగింపులో తెలుగు క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మేజర్ ఆర్.నాగేశ్వరరావు, మేజర్ ఎస్తేర్ రాణి సారథ్యంలో ప్రధాన వీధుల్లో సాగిన ఊరేగింపులో మట్టలతో పాల్గొన్న తెలుగు క్రైస్తవులు గీతాలు ఆలపిస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ వేడుకలో సంఘపెద్దలు, స్త్రీలు, సండే స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.



అయినావరం రైల్వే క్వార్టర్స్‌లో మట్టల ఊరేగింపులో పాల్గొన్న రక్షణ సైన్యం సేవకులు

హుషారుగా చేపల వేట



కుటుంబ సమేతంగా చేపలు పడుతున్న గ్రామస్తులు

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుపత్తూరు సమీపం పుళదిపట్టివిల్లి చెరువులో ఆదివారం వేకువజాము చేపలు పట్టే వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పుళదిపట్టి విల్లి చెరువు ఆయకట్టుకింద పంట పొలాలకు సాగునీటిని అందిస్తున్నారు. ఈ పెద్ద చెరువు వేసవిలో నీటి మట్టం తగ్గకమునుపే ఊరివారంతా కలిసి అందులోని చేపలను పట్టుకోవడం ఓ పండుగలా యేళ్ల తరబడి కొనసాగిస్తున్నారు. ఆ మేరకు ఆదివారం వేకువజామునే ఊరివారంతా కుటుంబ సమేతంగా వెళ్లి చేపలపట్టడంలో పోటీపడ్డారు. చిన్న వలలు, బుట్టలు చెరువునీటిలో వేసి చేపలను లాఘవంగా పట్టుకున్నారు. కడలా, రోగు, విరాలి, కండై వంటి మేలిరకం చేపలు మెండుగా లభించడంతో ఆనందం వ్యక్తం చేశారు. సుమారు 20 గ్రామాలకు చెందిన ప్రజలు ఈ చేపల వేటలో హుషారుగా పాల్గొన్నారు.

నేత్రపర్వం... సీతారాముల కల్యాణోత్సవం



తిరుత్తణి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలల్లో భాగంగా పల్లిపట్టు అంజనేయనగర్‌లోని వీర మంగళ అంజనేయస్వామి సమేత కల్యాణరామస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామునుంచే ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 6న ధ్వజారోహణంతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సీతారాముల కల్యాణోత్సవానికి పలు ప్రాంతాల నుంచి ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యలో భక్తులు పండ్లు, పూలు, పట్టువస్త్రాలతో ఆలయానికి చేరుకుని కల్యాణోత్సవాన్ని తిలకించి, పులకించిపోయారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఇందులో ఆలయ అర్చకులు రంజిత్‌శర్మ, ఆలయ నిర్వాహకులు శ్రీనివాసన్, హేమాద్రి, పురుషోత్తం, శివకుమార్, మోహన్‌రెడ్డి, లోకనాథన్, బాలా, దేవా, మోహన్, శరత్ పాల్గొన్నారు.



దర్శనం కోసం క్యూలైన్లలో పెద్దసంఖ్యలో బారులుతీరిన భక్తులు

తిరుచెందూరు ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి, వరుస సెలవురోజులు కావడంతో తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో ప్రసిద్ధి చెందిన సుబ్రమణ్యస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో ఆదివారం తరలి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం సమీపంలో ఉన్న సముద్ర తీరంలో పుణ్యస్నానమాచరించి క్యూలైన్లలో సుమారు ఐదు గంటలకు పైగా వేచివుండి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. రద్దీని దృష్టిలో వుంచుకుని ఆలయ నిర్వాహకులు తెల్లవారుజామున 4గంటలకే ఆలయాన్ని తెరచి పూజలు నిర్వహించారు. 4.30 గంటలకు విశ్వరూప దర్శనం, ఉదయం 6గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, 10 గంటలకు మహా అభిషేకం తదితర పూజలను శివాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



రోడ్డు దాటుతున్న పులి

రోడ్డు పైకొచ్చిన పులి

పర్యాటకుల బెంబేలు

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముధుమలై శరణాలయం పరిధిలో వెళ్తున్న పర్యాటకులు, పులి రోడ్డు దాటడం గమనించి బెంబేలెత్తారు. నీలగిరి జిల్లా గూడలూరు సమీపం ముధుమలై పులుల శరణాలయం పరిధిలో పులులు,చిరుతలు, ఏనుగులు సహా పలు జంతువులున్నాయి.రాత్రి వేళల్లో జంతువులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుంటాయి. ఈ నేపథ్యంలో, శుక్రవారం అర్ధరాత్రి ఆ మార్గంగా వెళుతున్న పర్యాటకుల వాహనానికి పులి అడ్డుగా రావడంతో నిలిపివేశారు. పులి రోడ్డు దాటి మరో ప్రాంతానికి వెళ్లిన అనంతరం వాహనాలు బయల్దేరి వెళ్లాయి. పులి రోడ్డు దాటుతున్న దృశ్యాలు పలువురు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కాగా, రాత్రి వేళల్లో జంతువులు రోడ్డు దాటుతుంటాయని, ఆ సమయంలో వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని, అదే సమయంలో జంతువులను భయపెట్టేలా వ్యవహరించరాదని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఘనంగా ఉగాది పురస్కారాల వేడుకలు



ఉగాది పురస్కారగ్రహీతలతో పొన్నూరు రంగనాయకులు తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అడయార్ ఆర్య వైశ్య అసోసియేషన్ (ఏఏఏ) ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు, తమిళ ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అడయార్ ఇందిరానగర్‌లోని డెసెట్ రోజ్ హాల్ వేదికగా అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నూరు రంగనాయకులు సారథ్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు గౌరవ అతిథులుగా ఈక్విటాస్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ హరీష్ క్రిప, ఎస్కేపీడీ ఛారిటీ ట్రస్టీ ఎస్.ఎల్.సుదర్శనం, టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ అడ్వైజర్ సి.వి. సుబ్బారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న ఎం.అపర్ణ, డాక్టర్ బి.శారద, డాక్టర్ ఎస్.బాలాజీ, శరత్‌చంద్రకుమార్, పి.మురళీధర్‌కు ఉగాది పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ముందుగా రంగనాయకులు మాట్లాడుతూ... తమ అసోసియేషన్‌లో చాలా మంది ప్రముఖులు సభ్యులుగా ఉన్నారని, ప్రతినెలా సుప్రభాత సేవతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు, తమిళ ఉగాది పండుగలను ఒకే వేదికపై జరుపుకోవడం సంతోషకరమన్నారు. అసోసియేషన్ కార్యదర్శి అద్దంకి సుధాకర్, కోశాధికారి బయ్యా బాలాజి కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్య, కళలు, వైద్యం సహా వివిధ రంగాల్లో రాణించిన వారు 2026లో పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని యూజీసీ ప్రకటించింది. ఈ మేరకు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కార్యదర్శి ఆర్.మనీష్‌జోషి అన్ని ఉన్నత విద్యాసంస్థలకు సర్క్యులర్ పంపారు. 2026లో పద్మ అవార్డుల కోసం దరఖాస్తులు, సిఫారసులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. జూలై 31వ తేదిలోపు https://awards.gov.in/లో దరఖాస్తు చేసుకోవచ్చు. జాతి, వృత్తి, స్థానం, లింగంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు. ఈ అవార్డుకు ఉన్నత విద్యాసంస్థలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని యూజీసీ తెలిపింది.